AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
15-9-2026 (Tuesday) MAIN EDITION

## కోతుల ఎఫెక్ట్.. కనుమరుగు అవుతున్న చెట్లు



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అంతటా కోతుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రజలపై కోతులు దాడి చేస్తున్నాయి. పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లోని చెట్లను నరికి వేస్తున్నారు. చెట్లు ఉంటే కోతులు ఎక్కువగా వస్తున్నాయి. వాటి బెడద తప్పించుకోవడానికి ఇళ్ల సమీపంలోని, పొలం గట్లపై ఉన్న చెట్లను రైతులు నరికి వేయిస్తున్నారు. కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## హిట్ అండ్ రన్ కేసులో నిందితుడి అరెస్ట్



**అక్షరటుడే, రాజస్థాన్:** గురుగ్రామ్ హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఓ యువతి తన స్పోర్ట్స్ బైక్‌పై వెళ్తుండగా ఓ వ్యక్తి కారుతో ఢీకొట్టాడు. ఆమె గాయపడ్డ ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలితో పాటు తండ్రి పోలీసులను కోరారు. ఈ క్రమంలో నిందితుడు కళ్యాణ్ బైన్స్‌లాను రాజస్థాన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

## ట్రంప్ కుమారుడి వెడ్డింగ్ పార్టీకి రష్యా కుబేరుడి నిధులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడి వివాహ వేడుకకు సంబంధించిన ఆసక్తికర నిజాలు వెలుగులోకి వచ్చాయి. తమ పెళ్లి ఖర్చుల కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అత్యంత సన్నిహితుడైన ఒక వ్యాపారవేత్త నిధులు సమకూర్చినట్లు వస్తున్న వార్తలను జూనియర్ ట్రంప్ ధ్రువీకరించారు.

## భారీ ఐపీవో.. నామమాత్రంగా జీఎంపీ




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ పబ్లిక్ ఇష్యూ ఈనెల 17 న ప్రారంభం కానుంది. కంపెనీ సుమారు రూ. 22,561.57 కోట్లను సమీకరించనుంది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్‌కు 21వ తేదీ వరకు అవకాశం ఉంటుంది.

## ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని(57) మంగళవారం మృతి చెందారు. వైసీపీ హయాంలో ఆరోగ్య శాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పని చేసిన ఆయన గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. ఆయన ఏలూరు నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.



# ఫ్రిజ్ పేలి నలుగురి మృతి

కర్ణాటకలోని బెళగావిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇంట్లోని ఫ్రిజ్ పేలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.

- అక్షరటుడే, నేషనల్ డెస్క్

**■ కర్ణాటకలో ఘోర విషాదం ■ నలుగురు మహిళల సజీవ దహనం ■ దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

బెళగావి నగరంలోని సెంట్రల్ బస్‌స్టాండ్ సమీపంలోని చావట్ గల్లీకి చెందిన గజానన్ దామోనే కుటుంబం గణేశ్ చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఇందులో భాగంగా తమ ఇంట్లో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం రాత్రి అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత ఫ్రిజ్‌కు సమీపంలో ఉన్న షెడ్‌లో నిద్రకు ఉపక్రమించారు.

### భారీ శబ్దం

అర్ధరాత్రి సుమారు 2:15 గంటల సమయంలో భారీ శబ్దం రావడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే ఆ షెడ్ వద్దకు పరుగెత్తారు. అప్పటికే అక్కడ మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే స్పందించి గజానన్, రోషన్‌లను బయటకు తీసుకొచ్చారు. అయితే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో మిగతా నలుగురు కుటుంబ సభ్యులు అందులోనే చిక్కుకుని సజీవ దహనమయ్యారు.

### ఒకే కుటుంబం..

ఈ ప్రమాదంలో భారతి దామోనే (50), శారద దామోనే (45), గంగ దామోనే (25), ప్రియ దామోనే (24) ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో శారద.. గజానన్ భార్య కాగా, భారతి ఆయన సోదరి. అలాగే గంగ, ప్రియలు గజానన్ దంపతుల కుమార్తెలు. తీవ్రంగా గాయపడిన గజానన్ (65), ఆయన కుమారుడు రోషన్ (21) ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గజానన్‌కు సుమారు 60 శాతం కాలిన గాయాలైనట్లు వైద్యులు వెల్లడించారు. గజానన్ వృత్తిరీత్యా కార్పెంటర్‌గా పనిచేస్తుండగా, మిగతా కుటుంబ సభ్యులు ఇళ్లలో పనులు, చిన్న ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

### షార్ట్ సర్క్యూట్ కారణమా?

ఈ ప్రమాద ధాటికి కాంక్రీట్ గోడలు లేని ఆ షెడ్ పూర్తిగా ధ్వంసమై, విలువైన వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ప్రాథమిక దర్యాప్తులో ఫ్రిజ్ పేలినట్లు తేలినప్పటికీ.. అసలు కారణంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కుటుంబ సభ్యులు గణేశ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అలంకరణ లైట్ల (డెకరేషన్ లైట్లు) కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగి ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. పూర్తి విచారణ తర్వాత అసలు విషయాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల్లా పోలీసుల తీరు : కేటీఆర్




**అక్షరటుడే, హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ పీఏ మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్‌ను పోలీసులు సోమవారం విచారణకు పిలిచారు. ఈ క్రమంలో వారిపై 15 దాడి చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. దీనిపై మంగళవారం ఉదయం కేటీఆర్ స్పందించారు. దాడి చేసిన వారు గుండాలా లేదా మఫ్టీలో వచ్చిన పోలీసులా తెలియాల్సి ఉందన్నారు. ఆ దుండగుల మీద ఎఫ్ఐఆర్ చేయమంటే కూడా చేయడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ ఇంటిపై దాడులు జరుగుతున్నాయన్నారు.

## ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్‌లోని చారిత్రాత్మక తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్ Vతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్ర వారసత్వ సంపద పరిరక్షణ, మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, రాబోయే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు రావాల్సిందిగా ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్‌ను సీఎం ఆహ్వానించారు.

## నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు




**అక్షరటుడే, ఏపీ :** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ నెల 23వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. నేడు సాయంత్రం సీఎం చంద్రబాబు నాయుడు ఉత్సవాలను ప్రారంభించనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 23 వరకు ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. వీఐపీ బ్రేక్ దర్శనాలు, ప్రత్యేక దర్శనాలు, శ్రీవాణి దర్శనాలను సైతం రద్దు చేశారు. రాత్రి 8 గంటలకు ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకోనున్నారు.

## బండ్లగూడలో ఒకరి దారుణ హత్య



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలోని నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. బండ్లగూడలో వేట కొడవళ్లు, కత్తులతో వెంట పడి ఒకరిని దుండగులు హత్య చేశారు. నిందితులు వెంటబడటంతో ఆ వ్యక్తి ఓ వైన్ షాపులో తలదాచుకున్నాడు. ఆ విషయాన్ని గమనించిన నిందితులు బయటకు లాగి మరి దాడి చేశారు. మృతుడిని ఇల్లెందుకు చెందిన రౌడీ షీటర్ నయీమ్‌గా పోలీసులు గుర్తించారు. పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగినట్టు అనుమానిస్తున్నారు.





## డొనాల్డ్ ట్రంప్‌కు సుప్రీంకోర్టు షాక్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మిడ్ టర్మ్ ఎన్నికల ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. ట్రంప్ మెయిల్ బ్యాలెట్ ఆంక్షలను తిరస్కరించింది. రాష్ట్రాలు పాత విధానంలోనే మెయిల్ బ్యాలెట్లు పంపేందుకు అనుమతి ఇచ్చింది. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ క్రమంలో మెయిల్ బ్యాలెట్‌పై ట్రంప్ ఆంక్షలు విధించారు. దీనిపై కొందరు ఆ దేశ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ శామ్యూల్ అలిటో, క్లారెన్స్ థామస్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టారు. మధ్యంతర ఎన్నికలకు ఈ ఆంక్షలు అమలులోకి రాకూడదని జస్టిస్ బ్రెట్ కావనా పేర్కొన్నారు.

## యూపీఐ లావాదేవీలపై కేంద్రం కీలక ఆదేశాలు

**అక్షరటుడే, ఢిల్లీ :** యూపీఐ లావాదేవీలపై కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. రూ.2 వేల వరకు చెల్లింపులపై ఛార్జీలు లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లకు ఆదేశాలు ఇచ్చింది. రూ.2 వేలలోపు లావాదేవీలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి రుసుము విధించొద్దని పేర్కొంది. రూ.2 వేలకు మించి ఉంటే ఛార్జీల విషయమై కేంద్రం స్పష్టత ఇవ్వలేదు. అయితే ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు ఉండబోవని తెలుస్తోంది. భవిష్యత్‌తో రూ.2 వేల కంటే ఎక్కువ ఉంటే నామమాత్రంగా ఎండీఆర్ వసూలు చేసేందుకు కేంద్రం పరిశీలిస్తోందని సమాచారం.






## ఉద్యోగులకు ఒరాకిల్ షాక్

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ టెక్ దిగ్గజం ఒరాకిల్ సంస్థ తన ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ రోజే మీ చివరి పని దినం అని తెల్లవారుజామున 6 గంటలకు మెయిల్ పంపింది. ఏఐ రాకతో అనేక టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఒరాకిల్ సైతం కాస్ట్ కట్టింగ్ చర్యలు చేపట్టింది. పలువురు ఉద్యోగులను తొలగించి, ఏఐ ద్వారా వారి సేవలను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉదయం పలువురికి మెయిల్స్ పంపింది. "మీ పదవికి సంబంధించి మేము ఒక కఠినమైన వార్తను తెలియజేస్తున్నాం... ఈరోజే మీ చివరి పనిదినం." అని అందులో ఉంది. దీంతో వారు షాక్ అయ్యారు.

## కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు

**అక్షరటుడే, ఏపీ :** ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, పెట్రోల్, గ్యాస్ ధరలపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల వల్లే సామాన్యులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతుండటంతో నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందని ద్రాక్షలా మారాయని పేర్కొన్నారు. యుద్ధాలు ఆగిపోవాలని సెప్టెంబర్ 28న వాషింగ్టన్ డీసీ వేదికగా ప్రత్యేక శాంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

